విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని వినతి

గౌతంనగర్: వేసవికాలం దృష్ట్యా గౌతంనగర్ డివిజన్ పరిధిలో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని కార్పొరేటర్ మేకల సునీతారాము యాదవ్ విద్యుత్ కార్యాలయంలోని ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ కిరణ్‌లకు వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఎత్తుపెంచి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు మేకల రాముయాదవ్, నర్సింగ్‌రావు, అనిల్, నందు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ వెంకన్నకాలనీ, స్రవంతి కాలనీ, గణేష్‌నగర్, ఏకలవ్యనగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు శనివారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ పర్యటించారు. కాలనీల్లో మురుగు రోడ్లపై పొంగిపొర్లుతున్నందున నూతన డ్రైనేజీ లైన్లు వేయాలని జలమండలి అధికారులను కోరారు. నూతన డ్రెయిన్ పనులకు అంచనా వేసి వీలైనంత త్వరగా పనులు చేపట్టాలని ఆయన సూచించారు. సందీప్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రవీందర్, ప్రభాకర్, కొండల్‌రెడ్డి, సుధాకర్, మల్లారెడ్డి, శ్రీనివాస్ నేతలు సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పటిష్టతకు సమష్టిగా పనిచేయాలి

అల్వాల్: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు సమష్టిగా కృషి చేయాలని మహిళా కాంగ్రెస్ ఏ–బ్లాక్ అధ్యక్షురాలు వీనస్ మేరీ అన్నారు. శనివారం అల్వాల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వచ్చే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనిచేయాలని సూచించారు. సీనియర్ నాయకులు ఏ–బ్లాక్ అధ్యక్షులు నిమ్మ అశోక్‌రెడ్డి, చంద్రశేఖర్ హాజరై కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేసి ప్రజల కోసం పనిచేసే వారికి నాయకత్వం అందజేస్తారని తెలియజేశారు.

బార్‌లో వృద్ధుడి మృతి

మల్కాజిగిరి: బార్‌లో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమలగూడకు చెందిన పరుశురాం (60) గత కొన్నేళ్లుగా ఆనంద్బాగ్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 25న ఉదయం అతడి బంధువు నరేందర్‌కు ఫోన్‌చేసి ఆనంద్‌బాగ్ క్రాస్‌రోడ్ చాణిక్యపురిలోని బార్ బాత్రూంలో పరుశురాం మృతి చెంది ఉన్నాడని తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న మృతుడి కుమారుడు బార్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తండ్రి చనిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఈ సంఘటన జరిగిన ఐదు రోజుల తర్వాత వివరాలు తెలియజేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



క్షేత్ర దిగ్బలి చేస్తున్న వేదపండితులు, టీటీడీ వేదవిద్యార్థులు





పూర్ణాహుతిలో వేదపండితులు

ముగిసిన కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

వైభవంగా పూర్ణాహుతి కార్యక్రమం



కీసరగుట్ట ఆర్యవైశ్య సత్రం వద్ద కుంకుమార్చనలో మహిళలు



కీసర: కీసరగుట్ట భవానీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం పూర్ణాహుతి కార్యక్రమంతో వైభవంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6 రోజుల పాటు (ఫిబ్రవరి 24 నుంచి మార్చి 1 వరకు) జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తజన రంజకంగా జరిగాయి. శనివారం బ్రహ్మోత్సవాలు సంపూర్ణం చేస్తూ వేదపండితులు పుల్లేటికుర్తి గణపతిశర్మ, వేద విద్యార్థుల బృందం దేవాలయంలో ఉదయం నుంచి క్షేత్ర దిగ్బలి కార్యక్రమం నిర్వహించారు.

పూర్ణాహుతితో దేవతలకు నివేదన..

ఆలయానికి నలువైపుల ఉన్న దేవతామూర్తులకు వరిఅన్నంతో చేసిన లడ్డూప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం యాగశాలల్లో కలశాలకు పూజచేసి దేవతలను తిరిగి సాగనంపే కార్యక్రమమైన పూర్ణాహుతి కార్యక్రమం వేదమంత్రాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తాటాకం నారాయణ దంపతుల చేత ప్రత్యేక పూజల అనంతరం దేవతలను సంతృప్తి చేందాలని పేర్కొంటూ.. 'సర్వేజన సుఖినోభవంతు' అని కాంక్షిస్తూ యాగవస్తువులను అగ్నిగుండంలో నేతితో సహా వేస్తూ పూర్ణాహుతి చేశారు.

భారీగా తరలివచ్చిన భక్తులు..

పుణ్యావాచనము ద్వారా దేవతలను ఆహ్వానించి బ్రహ్మ నిర్దేశించినట్లుగా పరమేశ్వరుడి ఉత్సవాలను జరిపించి పూర్ణాహుతి ద్వారా దేవతలను సాగనంపే ఘట్టం ముగిసిందని వేద పంతులు మార్తి సత్యనారాయణశర్మ అన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

విశేష పూజలు.. అలంకరణ..

స్వామివారి దర్శనం అనంతరం ఆలయానికి ఎదురుగా ఉన్న శివలింగాలకు భక్తులు పాలు, కుంకుమ, పసుపు, నూనెలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని అలంకరించారు. అనంతరం కుటుంబసమేతంగా హుడా పార్కు, ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో వంటవార్పు చేసుకుని సాయంత్రం వరకు హాయిగా గడిపారు. ఆలయ ఫౌండర్ కుటుంబసభ్యులు, ట్రస్టుబోర్డు సభ్యులు, ఈవో సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంకుమార్చన పూజ..

కీసర: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నదానసత్రం ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో శనివారం వాసవిమాత అభిషేకం, కుంకుమార్చన,అమ్మవారికి ఒడిబియ్యం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదే రమేష్‌గుప్తా, ఆర్యవైశ్య నిత్యాన్నదానసత్రం ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాయిల శ్రావన్‌గుప్తా, కోశాధికారి నగేష్‌గుప్తా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పద్మజ శర్మ శిష్యబృందంచే నిర్వహించిన త్యాగరాజ ఉత్సవాల్లో భాగంగా సంగీత కచేరిలో భాగంగా శ్రీ గణనాథాం భజామ్యహామ్, ఎందరో మహానుభావులు, శ్రీరామ శ్రీరామ, గతమోహా శ్రీతపల, సీతాపతే, మనసున తదితర పాటలను పద్మావతి, హర్షిత, లక్ష్మీ ఇషితా, నళిని, మానస, శిరీష, జాహ్నవి, తమన్, సర్వాణి, భగవతి, శ్రీమల, కల్యాణి ఆలపించి మెప్పించారు. అనంతరం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్!

అల్వాల్: సైనిక్‌పురి భావన్స్ వివేకానంద కళాశాల సైన్స్, హుమానిటీస్ అండ్ కామర్స్ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జగదీశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భవిష్యత్తులో భారతదేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతుందన్నారు. విద్యార్థులు ఉన్నతలక్ష్యాలను ఎంచుకుంటేనే సమున్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు.

కష్టపడి పనిచేసే వారికే పదవులు



డివిజన్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

రామంతాపూర్: బీజేపీలో కష్టపడి పనిచేసిన వారికే పార్టీ నుంచి పదవులు లభిస్తాయని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ అన్నారు. శనివారం రామంతాపూర్‌లోని బీజేపీ క్యాంప్ కార్యాలయంలో ఇటీవల రామంతాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన వంగాల సంతోష్ గుప్తా ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. ప్రపంచంలో ఏ పార్టీలో లేని విధంగా ఒక్క బీజేపీ పార్టీలోనే సామాన్య కార్యకర్తలు, ప్రధానమంత్రి నుంచి మొదలుకుని మంత్రులు, ముఖ్యమంత్రులు గవర్నర్లుగా ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. దీనికి ఢిల్లీ సీఎం రేఖగుప్తా నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కూడా మెజారిటీ ప్రజలు బీజేపీకే మద్దతు తెలుపుతున్నట్లు ఆయన అభిప్రాయపడ్డారు. కార్పొరేటర్ చేతనాహరీష్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బండి పద్మ, జగన్‌యాదవ్, వెంకట్‌రావు, నరసింహ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనతో సృజనాత్మకత మెరుగు



విద్యార్థులతో కరస్పాండెంట్ గంగరాజు

మల్లాపూర్: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనత్మకను వెలికితీయడానికి ఎంతగానో ఉపయోగపడుతాయని మ్యూజిక్ టెక్నిషియన్ డాక్టర్ షాజీదాఖాన్ అన్నారు. శనివారం మల్లాపూర్ అశోక్‌నగర్‌లోని ఇందిరా మెమోరియల్ స్కూల్ సైన్స్‌ఫేర్–2025 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ట్రాఫిక్, పర్యావరణం, మ్యాథ్స్, సైన్స్, చంద్రయాన్, రోబో, సోలార్ సిస్టమ్, స్టూడెంట్స్ ప్రాజెక్ట్స్ వంటి నమునాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఫౌండర్ కేఏఎల్. రాజాకుమారి, కరస్పాండెంట్ విక్టర్ రాజాగోపాల్, పీఆర్ఓ జోషి విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. శనివారం నిర్వహించిన ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన సైన్స్, మ్యాథ్స్, సోషల్ సబ్జెక్ట్‌లో 200లకు పైగా నమూనాలను ఏర్పాటు చేశారు. రోప్ బ్రిడ్జ్, సోలార్ సిస్టమ్, గ్లోబ్, గేట్‌వే ఆఫ్ ఇండియా, చార్మినార్, వాటర్ పొల్యూషన్, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, మోడల్ విలేజ్, మెట్రోరైల్, అడవులు నరకడం వల్ల కలిగే నష్టాలు తదితర నమూనాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు, ఇన్‌చార్జ్ విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించాలి

మల్కాజిగిరి: విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని గౌతమ్ మోడల్ స్కూల్, ఎస్ఆర్‌డీజీ స్కూల్‌లో జరిగిన విద్యార్థుల సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువు నేర్పించే ఉపాధ్యాయులకు వారికి ఏఏ అంశాల్లో ఆసక్తి ఉందో గుర్తించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, పచ్చదనం పరిశుభ్రత లాంటి అంశాలను తెలియజేస్తూ కొత్త అంశాలు గుర్తించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు రూపొందించిన వాక్యూమ్ క్లీనింగ్ మోడల్స్, వాటర్ అలర్ట్ సిస్టమ్, వాటర్ ప్యూరిఫికేషన్ సిస్టమ్ తదితర ప్రదర్శనలను అభినందించారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం అంబేడ్కర్ విగ్రహం వద్ద పెద్ద నాలాపై రూ.94 లక్షలతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను అధికారులతో కలిసి నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులు చూసుకోవాలని సూచించారు. డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు మేకల ముత్యంరెడ్డి, విఠల్‌యాదవ్, నర్సింగ్‌రావు, హరిప్రసాద్, సుగుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన జర్నలిస్టులు



అల్వాల్: టీయూడబ్ల్యూజే – ఐజేయూ కార్యదర్శి దొంతుల వెంకట్‌రామిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులు శనివారం నేరేడ్‌మెట్‌లోని సీపీ కార్యాలయంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా వారు టీయూడబ్ల్యూజే డైరీలను ఆయనకు అందజేశారు. జర్నలిస్టుల భద్రత, ఆరోగ్యం తదితర విషయాలపై సహకరించాలని కోరగా.. సీపీ సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలోనే జర్నలిస్టులందరికీ మెగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటానని వివరించారన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, కాప్రా ప్రెస్‌క్లబ్ కార్యదర్శి శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, సీనియర్ జర్నలిస్టులు చంద్రమౌళి, మాధవరాయుడు, నర్సింగ్‌గౌడ్ తదితరులున్నారు.

కష్టపడి చదివి మంచిపేరు తెచ్చుకోవాలి



కాప్రా: విద్యార్థులు కష్టపడి చదివి సమాజం, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని అణుపురం గౌతమ్‌మోడల్ స్కూల్‌లో జరిగిన సైన్స్‌ఫేయిర్‌కు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై నమునాలను పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శేషుకుమారి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాసం మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మల్లాపూర్: యువత మత్తు, మాదక ద్రవ్యాలకు బానిసై, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని వాటికి దూరంగా ఉండాలని, మల్లాపూర్ సాయి మోడల్ హైస్కూల్ డైరెక్టర్ సందీప్ సూచించారు. శనివారం హైస్కూల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రసుత్తం గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల చాలామంది యువత చెడుమార్గంలో వెళ్తున్నారన్నారు. యువత వాటి భారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రిన్సిపాల్ హేమలత, ఎండీ ఉస్మాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

కుషాయిగూడ: డీగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు నైపుణ్యంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని పలువురు వక్తలు అన్నారు. ఈసీఐఎల్‌లోని సాయిసుధీర్ పీజీ కళాశాలలో పీజీ పూర్తిచేసిన 2018–24 విద్యా సంవత్సర విద్యార్థుల స్నాతకోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్లు కృష్ణచైతన్య, కరుణాసాగర్, జయశ్రీ, శ్రీనివాస్, సాయిసుధీర్ కళాశాలల చైర్‌పర్సన్ ఉషారాణి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేసి అభినందించారు. వారు మాట్లాడుతూ.. నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరువయ్యేలా కార్యచరణ చేసుకుని ముందుకుసాగాలన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

అల్వాల్: గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట ఉప్పర్‌పల్లిలో నివసించే నీలం శివశంకర్ (58) కిరాణా షాప్ నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం కిరాణా సామగ్రి కోసం తన ద్విచక్ర వాహనంపై నగరంలోకి వెళ్లి తిరిగి వస్తుండగా.. హకీంపేట వద్ద ఓ గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

కుషాయిగూడ: రంజాన్ సందర్భంగా మసీదుల వద్ద ప్రార్థనలు చేసే ముస్లింలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. రంజాన్ సందర్భంగా శనివారం ఆమె డివిజన్ పరిధిలోని పలు మసీదుల ముస్లింపెద్దలు, వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. లైటింగ్, శానిటేషన్, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అన్ని విభాగాల అధికారులకు సూచించారు. వాటర్‌వర్క్స్ ఏఈ సందీప్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ ఏజాజ్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

మేడిపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా దుగ్గడి మండలం బండపల్లి గ్రామానికి చెందిన మనోజ్ (23) ఘటికేసర్ మండలం అంకుశాపూర్‌లోని సీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. శనివారం కళాశాల ముగిసిన అనంతరం పర్వతాపూర్ సాయిఐశ్వర్యకాలనీలో ఉంటున్న అతడి సోదరి ఇంటికి వస్తుండగా మేడిపల్లి సీపీఆర్ఐ గేట్ వద్ద రోడ్డు దాటుతుండగా గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న లారీ మనోజ్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతికతతో నూతన ఆవిష్కరణలు జరగాలి

సీపీఐ శతజయంతి వార్షికోత్సవాల్లో శాస్త్రవేత్త కృష్ణప్రసాద్



కుషాయిగూడ: సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వాడుకుని నూతన ఆవిష్కరణలు జరగేలా యువత కృషిచేయాలని శాస్త్రవేత్త, సామాజిక కార్యకర్త కృష్ణప్రసాద్ అన్నారు. శనివారం సీపీఐ శతజయంతి వేడుకల సందర్భంగా 'సాంకేతికత అభివృద్ధి..నిరుద్యోగ సమస్య' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ అవకాశాలు అందరికీ అందినప్పుడే టెక్నాలజీ అభివృద్ధి చెందుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో బాధ్యతాయుతంగా ఉండకపోతే ప్రమాదకర మార్పులు వస్తాయన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, శ్రీకాంత్, శ్రీమాన్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, మాజిద్ అలీఖాన్, సతీష్, మహేష్, కల్యాణ్, ప్రీతమ్, సోహైల్, మహేందర్, సాయిలు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి!

దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న స్థానికులు



ప్రభుత్వ ఆసుపత్రిలో పొంగిపొర్లుతున్న మురుగు

రామంతాపూర్: ప్రధాన రహదారిలోని ప్రభుత్వ హోమియో ఆసుపత్రి మెడికల్ కళాశాల ఆవరణలో గతవారం రోజుల నుంచి డ్రైనేజీ పొంగిపొర్లి మురుగు పారుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. అవుట్ పేషెంట్లకు మందులు అందించే కౌంటర్ దగ్గర మురుగు చేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దుర్గంధం భరించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశుభ్రమైన వాతావరణం ఉండాల్సిన ఆసుపత్రి ప్రాంగణం అపరిశుభ్రత నెలకొనడంతో రోగులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. హోమియో ఆసుపత్రి, వైద్య కళాశాల అధికారుల మధ్య సమన్వయలోపంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపణలున్నాయి. ఆసుపత్రి అధికారులు తక్షణమే డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేదంటే వైద్యారోగ్యశాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామని స్థానిక నేత ఎర్రం శ్రీనివాస్ హెచ్చరించారు.

ప్రమాదకర కెమికల్ కంపెనీలను తరలించాలి



ఘటనా స్థలాన్ని సందర్శించిన బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్

కుషాయిగూడ: ప్రభుత్వం చొరవ తీసుకుని చర్లపల్లి పారిశ్రామికవాడ, రెడ్‌జోన్‌లో ఉన్న ప్రమాదకరమైన కెమికల్ కంపెనీలను వెంటనే తరలించాలని, బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ డిమాండ్ చేశారు. గతనెల 4న చర్లపల్లి పారిశ్రామికవాడలోని సర్వోదయ కెమికల్ కంపెనీలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం కారణంగా పక్కనే ఉన్న డీపీపీఎస్, ఫ్లోరోషీల్డ్ కంపెనీలకు మంటలు వ్యాపించి అగ్నికి అహుతైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కెమికల్ కంపెనీ మూలంగా నష్టపోయిన బాధితులకు అండగా ఆయన శనివారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఘటన స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చర్లపల్లి పారిశ్రామికవాడ, సమీపంలో కెమికల్ కంపెనీలకు అనుమతులిచ్చే ముందు అక్కడ ఉన్న కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను పీసీబీ అధికారులు దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఇష్టానుసారంగా రెడ్‌జోన్‌గా ప్రకటించినప్పటికీ కెమికల్ కంపెనీలకు అనుమతులిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు.

సుమారు రూ.5 కోట్ల మేర నష్టం..

పీసీబీ అధికారుల అవినీతి, నిర్లక్ష్యమే ఈ ప్రమాదాలకు కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చర్లపల్లి పారిశ్రామికవాడలో గుర్తించిన 7 కెమికల్ కంపెనీలను వెంటనే తరలించాలన్నారు. సుమారు రూ.5 కోట్ల వరకు నష్టపోయిన డీపీపీఎస్ కంపెనీ యజమాని సురేంద్రనాయక్‌ను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సర్వోదయ కెమికల్ కంపెనీ యజమానిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకోలేదు..

ఈ ఘటన జరిగి 25 రోజులు కావస్తున్నా.. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలున్నాయి. విచారణ పేరుతో జాప్యం చేయడం సరికాదన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ నేతలు మర్రి మోహన్‌రెడ్డి, నాదం, ఆనంద్‌గౌడ్, నర్సింగరావు, లక్ష్మణ్‌గౌడ్, వెంకటేశ్వర్లు, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.